

నకిలీ కరెన్సీ నోట్ల ముఠా గుట్టురట్టు

నకిలీ కరెన్సీ చలామణి చేస్తున్న ఒక పెద్ద ముఠా గుట్టు రట్టు చేసినట్లు అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. - 8లో



టీటీడీ ఈఓను కలిసిన అన్నమయ్య జన్మస్థలి వాసులు

తిరుమల తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ అధికారి శ్యామలరావుతో అన్నమాచార్యుల జన్మస్థలి వాసులు భేటీ అయ్యారు. - 8లో



అండగా ఉంటా!



పులివెందుల ప్రాంత నాయకులతో మాట్లాడుతున్న అధినేత వైఎస్ జగన్

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని.. ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ భరోసా ఇచ్చారు.

రెండు రోజుల జిల్లా పర్యటన కోసం సోమవారం సాయంత్రం పులివెందులకు చేరుకున్న వైఎస్ జగన్ తన క్యాంప్ కార్యాలయంలో ప్రజలతో మమేకమయ్యారు. అందర్నీ ఆప్యాయంగా పలకరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాగా.. తమ అభిమాన నాయకుడిని చూడడానికి జనం తరలిరావడంతో క్యాంపు కార్యాలయం సందడిగా మారింది.



జగన్ మామయ్యను చూసిన ఆనందంలో చిన్నారి









పేద ప్రజలు, కార్యకర్తలు,నాయకుల సమస్యలను ఓపిగ్గా వింటున్న మాజీ సీఎం వైఎస్ జగన్



హెలీప్యాడ్ వద్ద వైఎస్ జగన్‌తో కరచాలనం చేసేందుకు ఉత్సాహం చూపిస్తున్న జనం

పేదల దేవుడు



- మరువురాని మనిషి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్
- నేడు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి
- ఇడుపులపాయ ఘాట్‌లో నివాళులు అర్పించనున్న కుటుంబ సభ్యులు
- ఊరు వాడా విస్తృత సేవా కార్యక్రమాలకు సన్నాహాలు



ఈ చిత్రంలో కనిపిస్తున్న బాలుడి పేరు గాజులపల్లె హేమంత్ నరసింహారెడ్డి. బద్వేలు మండలం బయనపల్లె గ్రామం. నరసింహారెడ్డి, నాగేశ్వరమ్మ దంపతుల సంతానమైన హేమంత్ నరసింహారెడ్డి పుట్టుకతోనే చెవుడు, మూగ. రెండేళ్ల వయస్సులో సమస్యను గుర్తించే సరికే తండ్రి అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో తల్లి తల్లడిల్లిపోయింది. దిక్కుతోచని ఆ పరిస్థితుల్లో అప్పటి సీఎ వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం ఆ కుటుంబాన్ని ఆదుకుంది. హైదరాబాద్‌లో రూ.6 లక్షలు విలువైన ఆపరేషన్ చేసి కాంక్లియర్ ఇన్‌ప్లాంటేషన్ మిషన్ అందజేశారు. తన కుమారుడికి మాట వచ్చేలా సహకరించిన వైఎస్సార్‌ను జీవితాంతం గుర్తుంచుకుంటామని తల్లి నాగేశ్వరమ్మ ఆనందం వ్యక్తం చేస్తోంది.

సాక్షి ప్రతినిధి, కడప : వైఎస్సార్.. ఈ పేరు వింటే తెలుగు ప్రజల గుండె తడవుతుంది.. మనసు ఉప్పొంగుతుంది.. ఈ ఒక్క పేరు ఎందరికో జీవం పోసింది.. మరెందరికో స్ఫూర్తినిచ్చింది. కోట్లాది ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన అపురూపమది. తెలుగు నేల ఉన్నంతకాలం మరపురాని పేరు.. వైఎస్సార్. నేడు ఆయన జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం.

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మనతో లేరు. ఆయన ప్రవేశ పెట్టిన ప్రభుత్వ పథకాలు ఇప్పటికీ మనతో ఉన్నాయి. తరాల తరబడి దారిద్ర్యంతో కొట్టు మిట్టాడుతున్న పేదలకు ఫీజురీయింబర్స్‌మెంటు పథకం తలరాతలు మార్చివేసింది. పేదలకు ఆరోగ్యశ్రీ పథకం పునర్జన్మ కల్పించింది. ఇళ్లు లేని నిరుపేదలందరికీ గూడు కల్పించిన వైఎస్ఆర్ కల్పవృక్షమై నీడనిచ్చారు. అణగారిన వర్గాల ఉన్నతి కోసం రిజర్వేషన్లు కల్పించి చరిత్రను తిరగరాశారు. ఆరుగాలం శ్రమించినా ఫలితం దక్కని రైతన్నకు దన్నుగా నిలుస్తూ తోడునీడగా పెద్దన్న పాత్రను పోషించారు. ఒకటా రెండా..తన ఐదున్నరేళ్ల పాలనలో అన్ని వర్గాలకు ఏదో ఒక ప్రయోజనం కల్పించిన ఘనత ఆయనకు సొంతమైంది.

మానవత్వం మూర్తీభవించిన నాయకుడు....

డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మానవత్వం మూర్తీభవించిన నాయకుడు. అనంతపురం నుంచి అదిలాబాద్ దాకా.. శ్రీకాకుళం నుంచి చిత్తూరు దాకా .. వైఎస్సార్ పేరు వినిపిస్తే తెలుగు ప్రజల మనస్సు పులకిస్తుంది. అందుకు కారణం రాజకీయాలకు అతీతంగా పేదలను ప్రేమించడం, వర్గాలకు, పార్టీలకు, ప్రాంతాలకతీతంగా సమగ్రాభివృద్ధి శ్రీకారం చుట్టడమే. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 76వ జయంతిని మంగళవారం జిల్లా వ్యాప్తంగా ప్రజానీకం ఘనంగా నిర్వహించుకునేందుకు సన్నాహాలు చేసుకున్నారు. ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌లో జయంతి వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తనయుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు వైఎస్ కుటుంబసభ్యులు ఇడుపులపాయలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొననున్నారు.

జిల్లాపై ప్రత్యేక ముద్ర

నిర్లక్ష్యపు నీడలో మగ్గుతున్న కడప జిల్లాపై డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రత్యేక ముద్ర వేశారు. 2004లో ముఖ్యమంత్రి అయ్యాక అభివృద్ధిని నలుదిశలా పరుగులు పెట్టించారు. 2004-09 వైఎస్ హయాంలో యోగివేమన యూనివర్శిటీ, జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల, పశువైద్య విద్య కళాశాలను నెలకొల్పారు. జిల్లా కేంద్రంలో రిమ్స్ వైద్య కళాశాల, 750 పడకల రిమ్స్ ఆసుపత్రి, దంత వైద్యశాల, అలాగే ట్రిపుల్ ఐటీ, ఐ.జి కార్ల్ పశు పరిశోధన కేంద్రం, దాల్మియా, భారతి సిమెంటు కర్మాగారాలు, గోవిందరాజా స్పిన్నింగ్ మిల్స్ తీసుకొచ్చారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను డాక్టర్ వైఎస్ఆర్ హయంలో శరవేగంగా చేపట్టారు. ఎన్నికలప్పుడు మాత్రమే శంకుస్థాపనలు చేసే తెలుగుదేశం పార్టీ నాయకులకు కనువిప్పు కలిగించారు. సుమారు రూ.12వేల కోట్లతో జలయజ్ఞంలో భాగంగా సాగునీటి ప్రాజెక్టులకు ఖర్చు చేశారు. గాలేరు నగరి సుజల స్రవంతి, గండికోట కెనాల్, టన్నల్, గండికోట వరద కాల్వ, గండికోట ఎత్తిపోతల పథకాలను వైఎస్ఆర్ హయాంలో రూపొందించినవే. మైలవరం ఆధునికీకరణ, గండికోట రిజర్వాయర్, సర్వరాయసాగర్, వామికొండ ప్రాజెక్టు, సీబీఆర్, పీబీసీ, వెలిగల్లు, తెలుగుగంగ ప్రాజెక్టు పనులు చకచకా సాగించారు. జిల్లాలో వేగవంతంగా వృద్ధి సాధించింది. నాయకుడంటే డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిలా ఉండాలని, ప్రజలపై మానవత చూపాలని, అందుకే యావత్తు భారతదేశానికి ఆదర్శప్రాయుడుగా నిలిచారని పరిశీలకులు ఇప్పటికీ కొనియాడుతుండడం విశేషం.

మనసున్న మారాజతడు!

పారే నీరు.. పచ్చని పైరు..
అతని నేస్తాలు!

స్వచ్ఛమైన చిరునవ్వు..
అచ్చ తెలుగు మాట తీరు..
అతని ఆయుధాలు

పసిపిల్లల బోసినవ్వతడు
పండు ముసలోళ్ల
పెద్ద మనవడూ అతడే!

నిరుపేదల గుండెచప్పుడతడు
రోగుల పాలిట మహా దేవుడతడు!

అనాథల ఆత్మీయ బంధువతడు
అక్క చెల్లెమ్మలకు వరాలిచ్చిన
పెద్దన్నతడు

ఆరోగ్యశ్రీకి ఆయువు పోసిందతడే
అభాగ్యుల అభయహస్తమై
నిలిచిందీ అతడే!

అభివృద్ధికి కొత్త బాట వేసిందతడే
సంక్షేమానికి నవ భాష్యం
లిఖించిందీ అతడే!

తెలుగు నేలపై ..
నిండు వెలుగై ఉదయించినోడు..

ఇచ్చిన మాట కోసమే వెళ్తూ..
అస్తమించినాడు..

ఆదరించడంలో తన..
మన తేడా చూపించని..
మనసున్న మా'రాజ'తడు..
మా రాజశేఖరుడతడు!!

ఆరోగ్యశ్రీ పునర్జన్మనిచ్చింది



నాపేరు షేక్ ఆశాబీ. మాది రాజంపేట పట్టణంలోని బాలాజీనగర్. దివంగత సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రవేశ పెట్టిన ఆరోగ్యశ్రీ పథకం వల్ల పునర్జన్మ పొందాను. ఆపరేషన్‌కు ఒక్కరూపాయి కూడా ఖర్చు కాలేదు. గుండెకు పెద్ద ఆపరేషన్ చేయాలంటే లక్షల రూపాయలు ఖర్చు అవుతుందంట. ఆరోగ్యశ్రీ పథకమే లేకుంటే నేను గుండెకు పెద్ద ఆపరేషన్ చేయించుకోలేక ఈ పాటికి ఈలోకానికి దూరం అయ్యేదానిని. వైఎస్సార్ ఇప్పుడు లేకపోయినా ఆయన పెట్టిన ఆరోగ్యశ్రీ పథకం మాలాంటి పేదోళ్లకు పునర్జన్మ ఇస్తుంది. ఆయన చనిపోయి ఏళ్లు గడుస్తున్నా పేద ప్రజల గుండెల్లో ఉన్నాడు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పేదరికం తగ్గుముఖం



నాపేరు తంబెల దీప్తి. మాది రాజంపేట. మధ్యతరగతి కుటుంబం. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వల్ల నేను బీటెక్ పూర్తిచేసి క్యాంపస్ సెలక్షన్స్‌లోనే ఉద్యోగం సాధించాను. ప్రస్తుతం దేశంలో టాప్ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఒకటైన యాక్సెన్‌చర్ కంపెనీలో మంచి ప్యాకెజీతో ఉద్యోగం చేస్తున్నాను. అదే ఫీజురీయింబర్స్‌మెంట్ పథకం లేకుంటే పేద, మధ్య తరగతికి చెందిన కొన్ని లక్షల మంది ఉన్నత చదువులకు దూరం అయ్యేవారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వల్ల తెలుగు రాష్ట్రాల్లో కొన్ని లక్షల కుటుంబాలు పేదరికం నుంచి బయటపడ్డాయి.

రాజన్నను మరవలేను



నా పేరు ఆదెమ్మ, మాది నీరుగట్టువారిపల్లె. చేనేత కార్మికురాలు. నాకు నలుగురు బిడ్డలు. చీరలు నేస్తేనే ఇల్లు గడుస్తుంది. పిల్లలను ఉన్నత స్థాయికి తీసుకురావాలన్నదే తపన. మహానేత రాజన్న పుణ్య మాని నా పెద్ద కుమార్తె ఇడుపులపాయలో ట్రిపుల్ ఐటి సీటు వచ్చింది. బీటెక్ పూర్తి చేసి బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తుంది. రెండవ కుమారుడు హేమంత్‌కుమార్ బీటెక్ పూర్తి చేసి చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. మూడవ కుమార్తె మంజుల బీటెక్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తోంది. నాల్గోవాడు బెంగుళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. వైఎస్సార్ పథకాల వల్లే మా పిల్లలు ఉన్నత స్థితిలో ఉన్నారు. ఆయన రుణం మరవలేను.

యూనివర్సిటీ వైఎస్సార్ చలువే



రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేటలో హార్టికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఎంతో కృషి చేశారు. మా గ్రామం దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడం మహానేత చలువే. నేడు వేలాది మంది విద్యార్థులు వ్యవసాయ విద్యను అభ్యసిస్తూ.. రాష్ట్రానికే తలమానికంగా నిలవడం ఎంతో సంతోషంగా ఉంది.

– ఆకేపాటి రంగారెడ్డి, స్థానికుడు

రుణమాఫీ రైతులకు ఓ వరం



పంటలు పండక అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతాంగానికి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన రుణమాఫీ పథకం రైతులకు ఎంతో ఊరట నిచ్చింది. దీంతో అప్పులన్నీ తీరిపోయి నిలదొక్కుకున్నాం. రాష్ట్రంలో మాలాంటి ఎంతో మంది రైతులకు ఈ పథకం ఓ వరంలా మారింది.

– శ్రీనువాసులరెడ్డి, రైతు, కొర్రపాడు గ్రామం, రాజుపాళెం మండలం

వైఎస్సార్.. దేవుడు



దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశ పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం విద్యార్థులకు ఓవరంలా మారింది. ఆ పథకమే లేకుంటే నేను ఎంబీఏ చదివే వాడిని కాదు. ఆయన చలువ వల్ల ఎంబీఏ పూర్తి చేయగలిగాను. రూ.37000 డబ్బులు కూడా వచ్చింది. మాలాంటి వాళ్లకు వైఎస్ఆర్ దేవుడు.

– రామకృష్ణ, రాజుపాళెం మండలం, ఎంబీఏ విద్యార్థి.

మృగరాజుపై రారాజు



గ్రామోత్సవంలో సింహ వాహనంపై సౌమ్యనాథుడు

నందలూరు : శ్రీ సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా నాల్గవ రోజు సోమవారం సింహవాహనంపై శ్రీ సౌమ్యనాథ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఉత్సవమూర్తులకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిలో ఉభయ దేవేరులతో శ్రీ సౌమ్యనాథ స్వామి మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి స్వామివారు సింహవాహనంపై మత్స్యావతావరంలో భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకుని గోవింద నామస్మరణలతో ఊరేగింపు వెంట కదిలివచ్చారు. సూపరింటెండెంట్ హనుమంతప్ప, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, విజిలెన్స్ అధికారి శేషాచలం, భక్తులు పాల్గొన్నారు.

- బ్రహ్మోత్సవాలలో భాగంగా 5వ రోజు మంగళవారం ఉదయం పల్లకీసేవ గ్రామోత్సవం, తిరుమంజనం, రాత్రికి హనుమంతు వాహనంపై విహరించనున్నారు.

బాధ్యతగా ప్రజా సమస్యలను పరిష్కరించాలి

కలెక్టర్ శ్రీధర్

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కారవేదిక ద్వారా స్వీకరించిన ప్రజా విజ్ఞప్తులను నిశితంగా పరిశీలించి వాటిని ఎప్పటికప్పుడు బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అందిన ఫిర్యాదులపై కూడా ప్రత్యేక దృష్టిసారించి నిర్ణీత కాలవ్యవధిలోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.

బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులకు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ సభా భవనంలో వ్యవసాయ శాఖ ఖరీఫ్ 2025 పంటలబీమాకు సంబంధించిన గోడపత్రికలు, కరపత్రాలను కలెక్టర్ చామకూరి శ్రీధర్, జేసీ ఆదర్శరాజేంద్రన్‌లు విడుదల చేశారు.

10న మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్

జిల్లా వ్యాప్తంగా ఈనెల 10న మెగా పేరెంట్స్–టీచర్స్ మీట్‌ను నిర్వహిస్తున్నామని, తల్లి పేరుమీద ప్రతి విద్యార్థితో మొక్క నాటించడం ద్వారా తల్లిదండ్రులపై, పర్యావరణంపై బాధ్యత పెంపొందుతాయని కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ఈనెల 10న నిర్వహించబోయే మెగా పేరెంట్స్–టీచర్స్ మీట్‌పై జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, డిఈఓ, డీవిఈఓ, ఎంఈఓలు, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాల్స్, ఎంపీడీఓలు, రాజంపేట అడిషనల్ ఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డేలతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి దిశా నిర్దేశం చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలో దాదాపు రెండు లక్షల, 50 వేల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కలిసి దాదాపు 6,75,000 మంది ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.



బీమా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్, జేసీ, వ్యవసాయ శాఖ జేడీ తదితరులు

జిల్లా సబ్ జూనియర్స్ ఫుట్‌బాల్ బాలుర జట్లు ఎంపిక

మదనపల్లె సిటీ : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జిల్లా సబ్ జూనియర్స్ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక చేశారు. జిల్లా నలుమూలల నుంచి 60 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో 25 మందిని ఎంపిక చేసినట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్‌కుమార్, మురళీధర్ తెలిపారు. ఎంపికైన జట్టు ఈనెల 12,13 తేదీల్లో రాజమండ్రిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జట్టు ఎంపిక కార్యక్రమంలో కోచ్‌లు కమలేష్, మహేంద్ర నాయక్, విష్ణు, అంజనప్ప, మోహన్‌రెడ్డి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్యాంకర్ బోల్తా

మదనపల్లె సిటీ : వాటర్ ట్యాంకర్ బోల్తా పడి డ్రైవర్ గాయపడిన సంఘటన మదనపల్లె పట్టణం రెడ్డీస్ కాలనీలో సోమవారం జరిగింది. రెడ్డీస్ కాలనీకి చెందిన హుస్సేన్ మినరల్ వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ట్యాంకర్ నడుపుతుండగా అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

మదనపల్లె సిటీ : స్థానిక వారపుసంతలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు గమనించి టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోలీసులు జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుని బంధువులు ఎవరైనా ఉంటే టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం



జోష్ణవి (ఫైల్)

పీలేరు రూరల్ : పీలేరు పట్టణం బండ్లవంకలో ఓ విద్యార్థిని అదృశ్యమైంది. సీఐ యుగంధర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బండ్లవంకలో నివాసం ఉంటున్న రాజశేఖర్, సునీత కుమార్తె జోష్ణవి (13) స్థానిక చిత్తూరు రోడ్డు మార్గంలో జ్యోతీబా పూలే గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. అదే పాఠశాలలో తల్లి సునీత వంట మనిషిగా పని చేస్తోంది. ఆదివారం సాయంత్రం జోష్ణవి పుట్టిన రోజును పురస్కరించుకుని బండ్లవంకలోని ఇంటికి వచ్చింది. అదే ఇంట్లో అమ్మమ్మ, నానమ్మ ఉన్నారు. సాయంత్రం 6 గంటల వరకు ఇంటిలోనే ఉన్న జోష్ణవి అనంతరం కనిపించకుండా పోయింది. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద గాలించినా ప్రయోజనం లేదు. దీంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. జోష్ణవి ఆచూకీ తెలిసిన వారు 9440796745, 9440796744 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడిన సుబ్బారెడ్డి

పెద్దమండ్యం : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పెద్దమండ్యం – చిన్నమండెం రహదారిపై సోమవారం ఈ సంఘటన జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ముసలికుంట నుండి కలిబండకు గొర్రెల లోడుతో వెళుతున్న బొలెరో వాహనం, చిన్నమండెం నుండి ద్విచక్రవాహనంలో పెద్దమండ్యం వైపు వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీ కొంది. ప్రమాదంలో ద్విచక్రవాహనంలో ఉన్న చిన్నమండెంకు చెందిన సుబ్బారెడ్డి (40) తలకు తీవ్ర గాయాలయ్యాయి. పాపేపల్లె పంచాయతీలోని గుడిశవారిపల్లెలో జరుగుతున్న పీర్ల పండుగకు వస్తుండగా ఇతను ప్రమాదానికి గురయ్యాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితుడిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం. వెంకటేశ్వర్లు తెలిపారు.

నకిలీ కరెన్సీ నోట్ల ముఠా గుట్టురట్టు

- 10 మంది నిందితులను అరెస్టు చేసిన పోలీసులు
- నిందితులు కర్ణాటకతోపాటు అన్నమయ్య జిల్లా వారిగా గుర్తింపు
- మీడియాకు వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



నిందితుల అరెస్టు వివరాలను తెలియజేస్తున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

సాక్షి రాయచోటి : నకిలీ కరెన్సీ చలామణి చేస్తున్న ఒక పెద్ద ముఠా గుట్టు రట్టు చేసినట్లు అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. సోమవారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని డీపీఓలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి, రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్‌ల సమక్షంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మీడియాకు వివరాలు వెల్లడించారు. నకిలీ కరెన్సీ కేసుకు సంబంధించి 10 మంది నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. వాయల్పాడులోని లక్కీ బ్రాందీ షాపు మేనేజర్ నవీన్ కుమార్ దగ్గరకు ఈనెల 26వ తేదీన 500 రూపాయల నోటుతో మద్యం కొనేందుకు కాలేషా అనే వ్యక్తి వచ్చాడన్నారు. ఇంతకు ముందు కూడా రెండుసార్లు దొంగ నోట్లు ఇచ్చావని, తిరిగి ఇప్పుడు దొంగ నోటు తెచ్చావని అనగానే కాలేషా పారిపోయాడన్నారు. లక్కీ వైన్ షాప్ మేనేజర్ నవీన్ కుమార్ వెంటనే వాయల్పాడు పోలీస్ స్టేషన్‌లో సీఐ జె.ప్రసాద్ బాబుకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ నకిలీ కరెన్సీ నోట్ల ముఠా చీకటి పడగానే 500 రూపాయల నకిలీ కరెన్సీని మార్చే పనిలో ఉందన్న విషయం పసిగట్టిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారన్నారు. నకిలీ కరెన్సీ చలామణిపై నిఘా పెట్టిన పోలీసులు పక్కా సమాచారం ఆధారంగా ఈ ముఠా మదనపల్లి– బెంగళూరు ప్రధాన రహదారిలో వాయల్పాడు క్రాస్ వద్ద గల నయారా పెట్రోల్ బంక్ దగ్గరలో ఉన్నారని వాయల్పాడు సీఐ తమ సిబ్బందితో వెళ్లగా పారిపోయేందుకు ప్రయత్నించారన్నారు.

10 మంది నిందితుల అరెస్టు.. సామగ్రి స్వాధీనం

నకిలీ కరెన్సీ నోట్ల చలామణి నిందితులను చుట్టుముట్టి పట్టుకుని పెద్దమనుషుల సమక్షంలో విచారించగా షేక్ కాలేషా వలీ ద్వారా తీగ లాగితే డొంక కదిలినట్లు తెలిపారు. ఈ ఘటనలో షేక్ కాలేషా వలీ అలియాస్ కలేసా, వీయం ముస్తాక్ అహమద్ అలియాస్ ముత్తు, ఎస్ఎండీ హఫీజ్, భీమసింగ్ పండిట్ రాథోడ్ అలియాస్ భీమసింగ్ రాథోడ్, టి.కుమారస్వామి అలియాస్ కుమార్, షేక్ షఫీక్ అహ్మద్ అలియాస్ షఫీ, నందిమంగళం యెజాజ్ పాషా అలియాస్ యెజాజ్, వీఎం .ఫుర్ఖాన్, షేక్ ఆసిఫ్, షేక్ సుహెల్‌లు ఉన్నారన్నారు. వీరితో సంబంధమున్న కర్ణాటకకు చెందిన రాథోడ్, కుమార్, బాబు పరారీలో ఉన్నారన్నారు. నిందితుల నుంచి 735 నకిలీ 500 రూపాయల నోట్లు, ఒక ఎప్సాన్ ఎకో ట్యాంక్ ఎల్3210 ప్రింటర్, టీఎన్‌పీఎల్ ఏ4 800 జీఎస్ఎం పేపర్ల మూడు పెట్టెలు, ఒక లెనివో ల్యాప్‌టాప్, 12 సెల్‌ఫోన్లు, ఆర్‌బీఐ అక్షరాలతో ముద్రించబడిన ఆకుపచ్చ రిబ్బన్ స్వాధీనం చేసుకున్నామన్నారు, దొంగనోట్ల చలామణి గురించి ఒప్పుకున్నారని, వీరు ముగ్గురిపై ఇదివరకే కర్ణాటకలో పాత కేసులు ఉన్నాయన్నారు. ఈ ముగ్గురు మదనపల్లెలో దొంగ నోట్లను ముద్రించి చలామణి చేసేలా పథకం రచించారన్నారు. ఈ ముఠా నకిలీ నోట్లను ఎలా తయారు చేస్తోంది, వాటిని ఎలా పంపిణీ చేస్తోంది అనే వివరాలను ఎస్పీ మీడియాకు వివరించారు. దర్యాప్తులో మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని తెలిపారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామన్నారు. ఈ కేసులో నిందితులను అరెస్టు చేయడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, వాయల్పాడు సీఐ జె.ప్రసాద్ బాబు, ఎస్ఐలను అభినందించారు. సిబ్బందికి జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు నగదు రివార్డులు ఇచ్చి ప్రోత్సహించారు.

చంద్రప్రభ వాహనంపై సిద్దేశ్వరస్వామి



తాళ్లపాక పురవీధుల్లో సిద్దేశ్వరస్వామి పల్లకీ సేవ

రాజంపేట : తాళ్లపాక ఆలయాల బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి సిద్దేశ్వరస్వామి చంద్రప్రభ వాహనంపై, అలాగే హంస వాహనంపై చెన్నకేశవస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. టీటీడీ ఆలయ సంప్రదాయాల ప్రకారం తాళ్లపాక పురవీధుల్లో స్వామివారిని ఊరేగించారు. అంతకుముందు ఉదయం చెన్నకేశవస్వామి, సిద్దేశ్వరస్వామికి ఘనంగా పల్లకీ సేవ నిర్వహించారు. అలాగే శివ, కేశవ ఉత్సవ మూర్తులకు తిరుమంజన సేవ చేపట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానం డిప్యూటీ ఈఓ ప్రశాంతి పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, సర్పంచ్ గౌరీశంకర్, గ్రామస్తులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

14 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- ముగ్గురు స్మగ్లర్ల అరెస్టు
- మరొకరు పరార్



నిందితులు, స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, కారుతో అటవీ అధికారులు, సిబ్బంది

సిద్దవటం : సిద్దవటం రేంజి సిద్దవటం బీటులోని కమ్మపాలెం గ్రామ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి ఎర్రచందనం అక్రమ రవాణాకు సిద్ధం చేస్తున్న ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసి 14 ఎర్రచందనం దుంగలతో పాటు ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు సిద్దవటం రేంజర్ కళావతి తెలిపారు. మరో స్మగ్లర్ పరారయ్యాడన్నారు. సోమవారం సాయంత్రం అటవీశాఖ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. తమకు అందిన సమాచారం మేరకు సిద్దవటం మండలం కమ్మపాలెం గ్రామ సమీపంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం వెనుక వైపు ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణా చేసేందుకు కారులో దుంగలను లోడ్ చేస్తుండగా తన సిబ్బందితో వెళ్లి దాడి నిర్వహించామన్నారు. కడప నగరం రామాంజనేయ పురానికి చెందిన సన్నపూరి వెంకటరమణ, సీకే దిన్నె మండలం కొప్పర్తి గ్రామానికి చెందిన కొక్కిర పల్లె సుబ్బారెడ్డి, సిద్దవటం మండలం కమ్మపాలెం గ్రామానికి చెందిన కొడవటి కంటి శిఖామణిలను అరెస్టు చేశామన్నారు. తిరుపతికి చెందిన గిరిబాబు అనే వ్యక్తి పరారయ్యాడన్నారు. అతని కోసం తమ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారన్నారు. అక్కడ ఉన్న 14 ఎర్రచందనం దుంగలను, ఏపీ 04 ఏఏ 2007 నంబరు గల హుండై వర్నా కారును స్వాధీనం చేసుకొని అటవీ శాఖ కార్యాలయానికి తరలించామన్నారు. స్వాధీనం చేసుకున్న దుంగల బరువు 193 కిలోలు ఉండగా వాటి విలువ రూ. 56 వేలు చేస్తుందన్నారు. అరెస్టు చేసిన ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్‌లను తిరుపతి కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ కె. ఓబులేసు, బీటు అధికారులు పెంచల్‌రెడ్డి, మధు, అసిస్టెంటు బీటు అధికారిణి హైమావతి, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది, సాహెబ్ బావి బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కురబలకోట: మండలంలోని శిద్దారెడ్డిగారిపల్లెకు చెందిన శివశంకర్ (45) సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఉదయం ఇంటిలో పాలు తాగిన తర్వాత మృతి చెందాడు. మృతదేహానికి మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. మృతికి కారణం పోస్టుమార్టంలో వెల్లడి కావాల్సి ఉందన్నారు.

యువకుడి ఆత్మహత్య



మృతి చెందిన నారాయణ

నందలూరు : మండలంలోని మదనమోహనపురం గ్రామ పంచాయతీ వెంకటాద్రిపురం ఎస్టీ కాలనీకి చెందిన బొమ్మల నారాయణ (25) అనే యువకుడు కుటుంబ కలహాలతో ఆదివారం విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి వివరాల మేరకు బొమ్మల నారాయణ కడప నగరంలో ఇటుకల బట్టీలో పనిచేసేవాడు. మృతునికి రెండేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన మునెమ్మతో వివాహం జరిగింది. మృతుడు మద్యం తాగి ఇంటికి రావడంతో భార్య మందలించడంతో మనస్థాపానికి గురై విషద్రావణం తాగాడు. ఈ విషయం గమనించిన భార్య బంధువుల సాయంతో రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించింది. చికిత్స పొందుతూ నారాయణ అదేరోజు మృతి చెందాడు. ఈ సంఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతు ఆత్మహత్యాయత్నం

కురబలకోట: మండలంలోని బండపల్లెకు చెందిన రైతు చంద్రశేఖర్ రెడ్డి (28) ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు..బండపల్లెకు చెందిన చంద్రశేఖర్ రెడ్డితో రక్త సంబంధీకులు భూ తగాదా విషయమై ఘర్షణ పడ్డారు. దీంతో మనస్తాపానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి పురుగుల మందు తాగినట్లు సోమవారం పోలీసులు తెలిపారు. బాధ్యులపై కేసు నమోదు చేశామన్నారు.

నిర్ణీత గడువులోగా ప్రజా సమస్యల పరిష్కారం

జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు



ప్రజల వద్దకే వెళ్లి వినతులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను ముఖాముఖి అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యత ఇస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. ఓబులవారిపల్లి మండలం, చిన్నఓరంపాడు నుంచి పి. వెంకటరమణ, బి.కొత్తపేట నుంచి పి.మల్లేశ్వరమ్మ, కలకడ నుంచి వై.వెంకటయ్య, ఏకిల వంకపల్లి రాయచోటి నుంచి నూర్జహాన్‌లు నడవలేని స్థితిలో ఎస్పీ కార్యాలయానికి తమ సమస్యలను చెప్పుకునేందుకు వచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్పీ వారి వద్దకే వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

యువకుడి మృతదేహం లభ్యం



మడుగు వద్ద మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ భక్తవత్సలం



ఉస్మాన్ మృతదేహాన్ని కట్టె సాయంతో బయటకు తీసుకొస్తున్న ఎస్ఐ భక్తవత్సలం, పోలీసులు

సంబేపల్లె : మండల పరిధిలోని ఝరికోన ప్రాజెక్టు మొరవ సమీపంలోని మడుగులో ఆదివారం గల్లంతైన ఉస్మాన్ అనే యువకుడి మృతదేహం సోమవారం లభ్యమైంది. రాయచోటి అగ్నిమాపక సిబ్బంది, సంబేపల్లె పోలీసులు మడుగులో గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు ఉస్మాన్ మృతదేహాన్ని వెలికి తీశారు. శవపరీక్షల నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుమారుడి మృతదేహాన్ని చూడగానే తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

స్పందించని స్థానికులు..

యువకుడి మృతదేహాన్ని మడుగులో నుంచి బయటకు తీసుకు వచ్చే క్రమంలో ఒక్కరు కూడా పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సహకరించకపోవడం దారుణం. ఎవరంతట వారు ఫొటోలు, వీడియోలు తీసి వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారే గానీ మృతదేహాన్ని వెలికి తీసేందుకు సాయపడదామని ఏ ఒక్కరూ స్పందించలేదు. దీంతో ఎస్ఐ భక్తవత్సలం, అగ్నిమాపక సిబ్బందే అతి కష్టం మీద మడుగులో నుంచి మృతదేహాన్ని బయటకు తీసుకువచ్చారు.

విద్యా సహకార అవగాహన ఒప్పందం



ఎంఓయూ కుదుర్చుకుంటున్న సాయి ఇంజినీరింగ్ , కాలేజీ,సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజీ ప్రతినిధులు

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి పట్టణంలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల తన విద్యా ప్రమాణాలను అంతర్జాతీయ స్థాయికి విస్తరిస్తూ అమెరికాలోని ప్రఖ్యాత సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్‌తో విద్య, పరిశోధన, నైపుణ్య, అభివృద్ధి రంగాలలో అవగాహనా ఒప్పందం(ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ కార్యక్రమంలో సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజీ ప్రతినిధులు జాన్ ఎడ్వర్డ్ క్రిస్టోఫర్, ఇన్నిస్ కర్టిన్, ప్రీతీ సింగాల్ పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల వంటి సంస్థ అంతర్జాతీయ ప్రమాణాల మేరకు విద్యను అందించడం ప్రశంసనీయమన్నారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు ఉన్నత విద్య, పరిశోధన, శిక్షణ, అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలపై ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. అనంతరం కళాశాల డైరెక్టర్ రాజ్‌పుత్ మాట్లాడుతూ ఈ అవగాహనా ఒప్పందం ద్వారా విద్యార్థులలో బహుళ నైపుణ్యాల వికాసం, పరిశోధనాత్మక దృక్పథం, సాంకేతిక అంశాలపై లోతైన అవగాహన ఏర్పడేలా ఉద్దేశించామన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రీషియన్ మృతి



మృతి చెందిన ఖాజాపీర్

మదనపల్లె సిటీ : ఓ షాపునకు బ్యానర్లు కడుతుండగా ప్రమాదశాత్తు బోర్డు గాలికి విద్యుత్‌లైనుకు తాకడంతో కరెంట్ షాక్‌తో ఓ ఎలక్ట్రీషియన్ మృత్యువాత పడిన సంఘటన మదనపల్లె పట్టణం సీటీఎం రోడ్డులో సోమవారం రాత్రి జరిగింది. మదనపల్లె పట్టణం గొల్లపల్లి రింగ్‌రోడ్డుకు చెందిన ఖాజాపీర్(29) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో సీటీఎం రోడ్డులోని స్టడీ వర్క్ సెటిల్ అబ్రాడ్ సెంటర్‌కు బ్యానర్ పెట్టేందుకు మరో ఎలక్ట్రీషియన్ రమేష్‌తో పాటు వెళ్లాడు. బ్యానర్ బిగించే సమయంలో పెద్దగా గాలి వీచడంతో బోర్డు సమీపంలోని విద్యుత్ లైనుకు తగిలింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురై ఖాజీపీర్ కిందపడిపోయాడు. మరో ఎలక్ట్రీషియన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య రేష్మా, అంజులా (6) కుమారుడు ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే స్థానికులు పెద్ద ఎత్తున ఆస్పత్రికి చేరుకున్నారు. టు టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనపై విద్యుత్‌శాఖ ఏడీఈ హరి ఆస్పత్రికి చేరుకుని వివరాలు సేకరించారు.

పటిష్టమైనది భారతి సిమెంట్



మేస్త్రీలకు లక్ష రూపాయలు ఉచిత బీమా పత్రాలను అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

ఓబులవారిపల్లె : ఇతర కంపెనీల కంటే భారతి సిమెంట్ నాణ్యమైనది, పటిష్టమైనదని భారతి సిమెంట్ టెక్నికల్ ఇంజినీర్ శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీమాతా ఏజెన్సీలో భారతి సిమెంట్ వారి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోబోటిక్ టెక్నాలజీతో అల్ట్రా సాఫ్ట్ నాణ్యత రోబోటిక్స్ ప్రయోగశాల, జర్మన్ టెక్నాలజీ భారతి సిమెంట్ ప్రత్యేకతలని తెలిపారు. అనంతరం 40 మంది మేస్త్రీలకు లక్ష రూపాయల ఉచిత బీమా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో భారతి సిమెంట్ మార్కెటింగ్ అధికారి రమణారెడ్డి, డీలర్ మహేంద్ర రెడ్డి, మేస్త్రీలు పాల్గొన్నారు.

గాయపడిన యువకుడి మృతి



మృతదేహం వద్ద విలపిస్తున్న అవ్వా, తాతలు

రైల్వేకోడూరు అర్బన్: సైకిల్ తొక్కుతూ కిందపడి గాయపడిన యువకుడు మృతి చెందాడు. రైల్వేకోడూరు మండలం రాఘవరాజుపురం పంచాయతీ, రాజీవ్ గిరిజన కాలనీలో నివాసం ఉంటున్న ఆదెమ్మ, వెంకటయ్యల మనవడు ఇడిగంటి ఈశ్వరయ్య (17) సైకిల్‌పై నుంచి కిందపడ్డాడు. ఐదు రోజుల తరువాత మృతి చెందాడు. మృతుడికి తల్లిదండ్రులు లేకపోవడంతో అవ్వాతాతల వద్ద ఉండేవాడు. ఒక్కగానొక్క మనవడు మృతి చెందడంతో ఆ వృద్ధులు శోకసంద్రంలో మునిగిపోయారు. అండగా ఉండాల్సిన మనవడు మృతి చెందడంతో ప్రభుత్వం ఆదుకోవాలని వృద్ధులు వేడుకుంటున్నారు.

టీటీడీ ఈఓను కలిసిన అన్నమయ్య జన్మస్థలి వాసులు



టీటీడీ ఈఓకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

రాజంపేట : తిరుమల తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ అధికారి శ్యామలరావుతో పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలి వాసులు భేటీ అయ్యారు. సోమవారం టీటీడీ ఏడీ బిల్డింగ్‌లోని ఈఓ చాంబరులో కలిసి తాళ్లపాక అభివృద్ధికి సంబంధించి వినతి పత్రాన్ని అందజేశారు. వీరిలో ప్రభుత్వ పాలిటెక్నిక్ రిటైర్డు ప్రిన్సిపాల్ ఉద్దండం సుబ్రమణ్యం, సురేష్‌రాజు, గూడూరు వీరాంజనేయరాజు, యానాదిరాజు, వెంకటసుబ్బరాజు, చెంగలరాజు, తోట శ్రీనివాసులు, బీజేపీ నేతలు పోతుగుంట రమేష్ నాయుడు ఉన్నారు. వీరి వెంట టీటీడీ బోర్డు డైరెక్టర్ భానుప్రకాశ్ రెడ్డి ఉన్నారు. తాళ్లపాక ఆర్చి, రోడ్డు వెడల్పు చేసి ప్రముఖ కవుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని, సెంట్రల్ లైటింగ్, సంగీత నృత్య కళాశాలు ఏర్పాటు చేయాలని, తాళ్లపాకలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించాలని కోరారు.

ముదివేడు రేషన్‌షాపు సీజ్

కక్షసాధింపు చర్యలంటూ స్థానికుల ఆగ్రహం



సీఎస్‌డీటీ చర్యను నిలదీస్తున్న ముదివేడు డీలర్ షేక్ షమీనా

కురబలకోట : కురబలకోట మండలంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు నిర్వహిస్తున్న రేషన్ (చౌక దుకాణ) షాపు డీలర్లను తొలగించడానికి అధికార నాయకులు చాప కింద నీరులా పావులు కదుపుతున్నారు. ఇదివరలో మద్దిరెడ్డిగారిపల్లె డీలర్ రాజీనామా చేశారు. ఆ తర్వాత మొలకవారిపల్లె చౌకదుకాణంపై కన్నేశారు. అక్కడి డీలర్‌ను తొలగించే ప్రయత్నంలో భాగంగా కొత్తగా డీలర్‌షిప్‌కు నోటిఫికేషన్ కూడా ఇచ్చారు. కోర్టు ఆదేశాలతో మొలకవారిపల్లె చౌకదుకాణం యధావిధిగా కొనసాగుతోంది. తాజాగా సోమవారం ముదివేడులోని షేక్ షమీనాకు చెందిన షాప్ నెంబరు 1006020 చౌకదుకాణ డీలర్‌షిప్ తొలగించడానికి స్కెచ్ వేశారు. ఈమె వైఎస్సార్‌సీపీ సానుభూతి పరురాలన్న ముద్రవేశారు. ఓ అధికార పార్టీ నాయకుడు తెరవెనుక ఉండి స్థానిక సీఎస్‌డీటీ చాణుక్యను పంపి స్టాక్‌లో వ్యత్యాసం ఉందన్న సాకుతో షాప్‌ను సీజ్ చేయించారు. సరుకుల పంపిణీ బాధ్యతను అదే ఊరిలోని మరో షాప్‌కు కేటాయించారు. ఈ చర్యను రేషన్‌షాపు డీలర్ సమీన తీవ్రంగా ప్రతిఘటించారు. ఏతప్పు చేశానని ఈ చర్యకు దిగారని సీఎస్‌డీటీని నిలదీశారు. అప్పటికే డీలర్‌కు మద్దతుగా స్థానికంగా ఉన్న మైనారిటీలు, స్థానికులు షాపు వద్దకు చేరుకోవడంతో కొంత సేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అదే సమయానికి మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ వేపలపల్లె మధుసూధన్ రెడ్డి కూడా అక్కడికి చేరుకుని సీఎస్‌డీటీ చర్యను తప్పుపట్టారు షాప్‌ను సీజ్ చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు సీఎస్‌డీటీ తెలిపారు.

అక్రమ కేసులు బనాయించడం దారుణం



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న భారతీయ అంబేద్కర్ సేన సభ్యులు

రాయచోటి టౌన్ : మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె సమీపంలోని కొండపై బుద్ధుడి తలను నరికేసిన సంఘటనపై నిరసన తెలుపుతున్న బుద్ధ అంబేద్కర్ సమాజ్ ఉపాసకులపై కేసులు పెట్టడం దారుణమని ఆ సంస్థ సభ్యులు జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుద్ధ విగ్రహం ధ్వంసం చేయడాన్ని ప్రశ్నించినందుకు పోలీసులు తమపైనే కేసులు పెట్టడం విచారకరమన్నారు. జిల్లా పోలీసులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్యాల మోహన్, సీపీఐ నాయకులు శ్రీనివాసులు, బీఎస్పీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు యుగంధర్, రమణ పాల్గొన్నారు.

కబ్జా భూమిని స్వాధీనం చేసుకోండి

రాజంపేట రూరల్ : ఊటుకూరు పొలంలోని సర్వే నెంబరు 552లో చేజర్ల వాసుదేవరాజు కబ్జా చేసిన 10 సెంట్ల భూమిని అతని చెర నుండి విడిపించి రహదారి నిర్మాణానికి సహకరించాలని ఊటుకూరు గ్రామ రైతులు సబ్ కలెక్టర్ వైఖోమ్ విదియా దేవికి విన్నవించుకున్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో వీరు సమస్యను వివరించారు. తమ పూర్వీకుల కాలం నుండి ఊటుకూరు గ్రామ పొలంలో తమకు పొలాలున్నాయని తెలిపారు. తమ పొలాల్లోకి వెళ్లేందుకు సర్వే నెంబరు 552, 1497లోని రస్తా పొలాన్ని వినియోగించేవారమన్నారు. అలాగే వరికలాలకు ఉపయోగించుకునే వారమన్నారు. కడప శంకరాపురంలో నివాసం ఉండే చేజర్ల నరసింహరాజు కుమారుడు చేజర్ల వాసుదేవరాజు ఎనిమిదేళ్ల క్రితం ఈ స్థలాన్ని కబ్జా చేశాడని వాపోయారు. దీనిపై తాము 2019లో హైకోర్టును ఆశ్రయించామన్నారు. 2022 డిసెంబర్ 8వ తేదీ తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. ఇదే విషయాన్ని తాము కలెక్టర్, సబ్ కలెక్టర్, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారు అన్ని రికార్డులు పరిశీలించి సర్వే చేయించి, హద్దులు ఏర్పరిచి తమ పొలాలకు వెళ్లేందుకు దారిని ఏర్పరిచి ఇచ్చారన్నారు. ఇంకా అతని ఆక్రమణలో ఉన్న 10 సెంట్ల పొరంబోకు స్థలంలో రస్తాను వెడల్పు చేసుకుందామని ప్రయత్నించిన రైతుపై వాసుదేవరాజు దౌర్జన్యం చేస్తున్నాడని తెలిపారు. తమకు న్యాయం చేయాలని వారు కోరారు.